# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు, రేపు గుజరాత్‌లో పర్యటించి పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం శంకుస్థాపనల్లో పాల్గొంటారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నీతి ఆయోగ్ బృందంతో సమావేశవుతారు.**

**3.** **హైదరాబాద్‌లోని మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను నవంబరు 1వ తేదీన ప్రారంభించనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి 3 జిల్లాలకు తాగు, సాగునీరుని అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

**5.** **అర్హులైనవారందరూ ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ అన్నారు.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు, రేపు గుజరాత్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఈరోజు ఏక్తా నగర్‌లో 280 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలలో పాల్గొంటారు. అనంతరం 'ఆరంభ్ 6.0' లో భాగంగా 99వ కామన్ ఫౌండేషన్ కోర్సు శిక్షణలో ఉన్న అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే రేపు ఐక్యతా విగ్రహం వద్ద జరిగే జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులు అర్పించి 'ఏక్తా దివస్' ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొంటారు.

కాగా "జాతీయ ఐక్యతా దినోత్సవం"పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నీతి ఆయోగ్ బృందంతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. రాష్ట్రంలో అమలు చేసే కేంద్ర పథకాలు, విజన్ డాక్యుమెంట్ 2047 పై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ

దృశ్య మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నీతి ఆయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడనున్నారు.

---------------------------

హైదరాబాద్‌లోని మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు నవంబరు 1వ తేదీన శంకుస్థాపన చేయనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను తొలుత బాపూఘాట్ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. అక్కడి నుంచి 21 కి.మీ మేర అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే నెలలో ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని అన్నారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతోను చర్చిస్తామని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి 3 జిల్లాలకు తాగు, సాగునీరుని అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టును రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాలావీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి నిన్న పరిశీలించి, మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రాజెక్ట్ పై అధికారులతో మంత్రి సమీక్షించారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు వచ్చే నెలలో పనుల షెడ్యూల్ ను ప్రకటిస్తామని మంత్రి రామానాయుడు తెలియజేస్తూ,

....వాయిస్. 30 సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

రేపు దీపావళి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు భద్రతా ఏర్పాట్లపై ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌తో రాష్ట్ర హోంమంత్రి వి.అనిత అమరావతిలో నిన్న సమావేశమై చర్చించారు. 185 అగ్నిమాపక స్టేషన్లలో సిబ్బందికి ఎక్కడ ప్రమాదం జరిగినా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చినట్లు హోం మంత్రి వివరించారు. 100, 101 నంబర్లకు ఫోన్లు చేసి టపాసుల అక్రమ తయారీపై పోలీస్, ఫైర్ వ్యవస్థలకు ప్రజలు ఫిర్యాదు చేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. దేశవ్యాప్తంగా వాయుకాలుష్యం పెరుగుతున్న క్రమంలో రాష్ట్రంలోనూ ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ సూచించారు.

---------------------------

అర్హులైనవారందరూ ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన "పీఎం స్వా నిధి పథకం" రాష్ట్ర స్థాయి అవార్డుల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ప్రజలకు పొదుపు పట్ల అవగాహన కల్పించేందుకు ఈ రోజు ప్రపంచ పొదుపు దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిపై ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం..

..వాయిస్..40 సెకన్లు

---------------------------

ప్రముఖ అణు శాస్త్రవేత్త, పద్మభూషణ్ హోమీ జహంగీర్ బాబా జయంతి ఈరోజు. భారత అణు కార్యక్రమ పితామహుడు, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ సెంటర్, ఎటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యవస్థాపకులు, ఎటామిక్ ఎనర్జీ రంగంలో విశేష సేవలందించిన హోమీ జహంగీర్ బాబా 1909 అక్టోబర్ 30వ తేదీన ముంబైలో జన్మించారు. అణుశక్తి రంగంలో ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ జాతి యావత్తు ఆయనకు ఈరోజు ఘనంగా నివాళులర్పిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలోని రాజ్ భవన్ లో నిన్న సమావేశం అయ్యారు. ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్ సతీమణి సమీరా నజీర్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గవర్నర్ దంపతులకు వారు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర బడ్జెట్, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విధానాలు వంటి అంశాలపై గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారని అధికారులు వెల్లడించారు.

---------------------------

తెలంగాణాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇప్పటికే 18వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. డిసెంబర్‌లోపు 13 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. భారత పత్తి సంస్థ-సిసిఐ నిబంధనల ప్రకారం రైతులు పత్తిని తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

======================